
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 23 । మే । 2025



సోమశిలలో 45.108 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారానికి 45.108 టీఎంసీల నీరుంది. పెన్నార్ డెల్టాకు 3,230, ఉత్తర, దక్షిణ కాలువలకు 250 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.99,300
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.8,957
3శాతం జీఎస్టీతో	రూ.9,226
నవర (8గ్రా)	రూ.73,808

గరిష్టం/కనిష్టం 35.2 /25.6

వాతావరణం

జిల్లాలో వాతావరణం శుక్రవారం సాధారణంగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 53 శాతంగా గురువారం నమోదైంది.

న్యూస్‌రీల్

మార్కెటింగ్‌పై శిక్షణ



మాట్లాడుతున్న నాగరాజకుమారి

నెల్లూరు (పొగతోట): స్వయం సహాయక గ్రూపు మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి కాంక్షించారు. ఆన్‌లైన్ మార్కెటింగ్‌పై సీసీలు, ఏపీఎంలకు గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కుటీర, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరు చేయించి స్వయం సహాయక గ్రూపు మహిళలను ప్రోత్సహిస్తామని చెప్పారు. ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్ కల్పించేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని వివరించారు. వినియోగదారులను ఆకర్షించేలా ఉత్పత్తులను అందుబాటులో ఉంచాలని తెలిపారు.

సీహెచ్‌ఓల మానవహారం



నెల్లూరు(అర్బన్): తమను ప్రభుత్వం, అధికారులు ఎంత ఇబ్బంది పెట్టినా, సమస్యలను పరిష్కరించేంత వరకు పోరాటాన్ని ఆపేది లేదని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భానుమహేష్ స్పష్టం చేశారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లను మూసేసి నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద సీహెచ్‌లు చేపట్టిన నిరసన దీక్షలు గురువారంతో 25వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా గుప్తా పార్కు రోడ్డులో ప్లకార్డులను ప్రదర్శిస్తూ మానవహారంగా ఏర్పడ్డారు. సంఘ ప్రధాన కార్యదర్శి రుబికా, జిల్లా కో ఆర్డినేటర్ ఆదిల్, ఈసీ మెంబర్ మాబ్జాన్, విజయ్, ప్రశాంతి, స్వాతి, చంద్రకళ పాల్గొన్నారు.

చిన్నారులకు ఎమ్మార్ వ్యాక్సిన్ తప్పనిసరి

- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: జిల్లాలోని ఐదేళ్లలోపు చిన్నారులకు ఎమ్మార్ వ్యాక్సిన్‌ను తప్పక వేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. ఎమ్మార్ వ్యాక్సినేషన్‌పై కలెక్టరేట్లోని తన చాంబర్లో గురువారం నిర్వహించిన జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తట్టు, పొంగు వ్యాధుల నివారణకు టీకాలను వేయాలని కోరారు. ఎమ్మార్ వ్యాక్సినేషన్‌పై జిల్లాలో మూడు విడతల్లో ప్రచారం చేయాలని సూచించారు. అర్బన్ ప్రాంతాల్లోని మురికివాడలు, ఇటుక బట్టీలు, భవన నిర్మాణ ప్రాంతాల్లో చిన్నారులకు టీకాలను వేయాలని చెప్పారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఉమామహేశ్వరి, డీఎంహెచ్‌ఓ సుజాత, ఐసీడీఎస్ పీడీ సువర్ణ, డీసీహెచ్ఎస్ పరిమళ, మెప్మా పీడీ లీలారాణి, ఐటీడీఏ పీఓ మల్లికార్జునరెడ్డి, జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ, డాక్టర్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాలకు నోటీసులు



మాట్లాడుతున్న నందన్

నెల్లూరు(బారకాసు): నగరంలో అనధికార నిర్మాణాలకు సంబంధించి చార్జిషీట్లను దాఖలు చేసి యజమానులకు నోటీసులను అందజేయాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. నగరపాలక సంస్థకు సంబంధించిన కోర్టు కేసుల దాఖలు తదితర అంశాలపై కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సచివాలయ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి భవన నిర్మాణ అనుమతులు, ఇతర ధ్రువీకరణ పత్రాలను పరిశీలించాలని సూచించారు. సిటీ ప్లానర్ హిమబిందు, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

దళిత ఉద్యోగులపై కన్నెర్ర

కూటమి ప్రభుత్వం కొలువుదీరాక దళిత ఉద్యోగులపై వేధింపుల పరంపర కొనసాగుతోంది. తమ ప్రజాప్రతినిధులకు అనుకూలంగా ఉండే పంచాయతీ కార్యదర్శులను అందలమెక్కిస్తూ.. నిబంధనలను పాటిస్తూ.. మాటవినని వారిని వేధిస్తూ.. ఆకాశరామన్న ఉత్తరాల పేరిట విచారణ జరిపి సస్పెన్షన్ వేటేస్తోంది. గడిచిన ఏడు నెలల్లో జిల్లా పంచాయతీ శాఖలో 24 మంది పంచాయతీ కార్యదర్శులు సస్పెన్షన్‌కు గురికాగా, వీరిలో 14 మంది ఎస్సీ, ఎస్టీలే కావడం గమనార్హం. ఈ తీరుపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.



- ఏడు నెలల్లో 24 మంది పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్
- అందులో 14 మంది ఎస్సీ, ఎస్టీలే
- నిధుల దుర్వినియోగం సాకు చూపి చర్యలు
- పంచాయతీ శాఖ కార్యాలయంలో ఇదీ తంతు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోంది. పంచాయతీ కార్యదర్శులను వేధిస్తూ పైశాచికానందాన్ని పొందుతోంది. జిల్లా పంచాయతీ శాఖలో ఈ తతంగం ప్రతిమించుతోంది.

ఇదీ తీరు..

గతంలో పంచాయతీ కార్యదర్శిపై రాష్ట్ర నేత పేరుతో ఫిర్యాదు చేశారు. సంబంధిత లేఖ నేతకు చేరడంతో తాను చేయలేదని, ఈ అంశమై కోర్టును ఆశ్రయిస్తామని ఆయన బదులిచ్చారు. దీంతో కంగుతిన్న పంచాయతీ అధికారులు సర్దుబాటు చేసుకున్నారు. జిల్లా పంచాయతీ కార్యాలయంలో ఎంతోకాలంగా పనిచేస్తున్న అధికారి.. తనకు కూటమి ప్రభుత్వంలోని మంత్రి అండదండలున్నాయనే అహంకారంతో కిందిస్థాయి సిబ్బందిని వేధింపులకు గురిచేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

విచారణ పేరిట ముడుపులు

ఆకాశరామన్న ఉత్తరాలు రాయడం.. విచారణ పేరుతో అధికారులు తనిఖీ చేసి లంచాలివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. వీటిని సమర్పించలేని పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తున్నారు. పూర్తిస్థాయిలో ఆధారాలు చూపినా, పంచాయతీరాజ్ కమిషనర్‌కు నివేదికలు పంపి అక్కడి నుంచి సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేస్తున్నారు. ఇటీవలి కాలంలో వేధింపులు, సస్పెన్షన్లు అధికమవుతున్నాయి.

అనుకూలంగా ఉంటేనే ప్రోత్సాహం

కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, మండల నేతలకు అనుకూలంగా ఉండేవారినే ప్రోత్సహిస్తున్నారు. అలా వ్యవహరించని పంచాయతీ కార్యదర్శులపై సస్పెన్షన్ వేటేస్తున్నారు. కోవూరు మండలం గంగవరం పంచాయతీ కార్యదర్శి నాయబ్ రసూల్‌ను వేధింపులకు గురిచేశారని సమాచారం. అడిగినంత ముట్టజెప్పకపోవడంతో త్వరలో సస్పెన్షన్ ఉత్తర్వులు పంపుతామంటూ అధికారులు బెదిరింపులకు దిగారనే విమర్శలు వినిపిస్తున్నా యి. సంగంలో పనిచేస్తున్న మహిళా కార్యదర్శికి ఇదే తరహాలో హెచ్చరికలు జారీ చేశారని సమాచారం. జిల్లావ్యాప్తంగా అనేక మండలాల్లో పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి ఇదే తరహాలో ఉంది. వాస్తవానికి పంచాయతీకి సంబంధించిన ఇంటి, కుళాయి పన్నులను వసూలు చేసి జిల్లా ఖజానాలో జమ చేయాల్సి ఉంది. అయితే నిధుల లేమి కారణంగా పారిశుధ్యం, బ్లీచింగ్, తదితరాలకు ఈ నిధులనే వినియోగిస్తున్నారు. ఇలాంటి వాటిని అధికారులు తప్పుపట్టి బెదిరింపులకు దిగుతున్నారని తెలుస్తోంది.

మంత్రి మనిషినంటూ హల్‌చల్

మంత్రి మనిషినని చెప్పుకొనే అధికారి కార్యాలయంలో హల్‌చల్ చేస్తున్నారు. ముడుపులను సమర్పించాలంటూ కోవూరులో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులను పలుమార్లు డిమాండ్ చేశారనే ఆరోపణలున్నాయి. సయోధ్య కుదరకపోవడంతో సస్పెండ్ చేశారు. పొదలకూరుకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శి దొరబాబు, సంగం మండలంలో పనిచేసిన అల్లాబక్షుపై అవినీతి ఆరోపణలొచ్చాయి. వీటిపై విచారణ జరిపినా, ఇప్పటికీ చర్యలు చేపట్టలేదు. తమకు అనుకూలంగా ఉంటూ అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్న వారికి అండగా నిలుస్తున్నారు.

నిధులు దుర్వినియోగం చేసిన వారినే సస్పెండ్ చేస్తున్నాం

పంచాయతీ కార్యదర్శులపై అవినీతి ఆరోపణలొస్తున్నాయి. లేఖల ద్వారా ఫిర్యాదు చేసిన వాటిపై డీఎల్పీఓలను విచారణాధికారులుగా నియమిస్తున్నాం. నిధులు దుర్వినియోగమయ్యాయనే అంశం నిర్ధారణైతే పంచాయతీరాజ్ కమిషనర్, కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేస్తున్నాం.

– శ్రీధర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి

పరిశ్రమలకు త్వరితగతిన అనుమతులు



మాట్లాడుతున్న ఆనంద్

నెల్లూరు రూరల్: పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులను వివిధ శాఖలు త్వరితగతిన మంజూరు చేయాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో గురువారం నిర్వహించిన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు వ్యవహరించని అధికారులపై క్రమశిక్షణ చర్యలకు వెనుకాడేదిలేదని స్పష్టం చేశారు. ఆటోనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఇరిగేషన్ కాలువ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ సంస్థల ఆధునీకీకరణ పథకాన్ని జిల్లాలో అమలు చేయాలని సూచించారు.

- పీఎం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమ అమల్లో భాగంగా వివిధ కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతగా టీబీ బాధితులకు ఆర్థిక, పోషక సాయాన్ని అందించాలని కోరారు.
- జూన్ 21న నిర్వహించనున్న యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్రానికి ప్రధాని మోదీ విచ్చేయనున్న క్రమంలో యోగాంధ్ర పేరుతో జిల్లాలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నెల పాటు నిర్వహించనున్నామని వెల్లడించారు. కృష్ణపట్నం పోర్టు, ఎడిబుల్ ఆయిల్ యూనిట్ ఉద్యోగులు, ఇతర పరిశ్రమ వర్గాలు తమ పరిధిలో యోగాను ఆచరించేలా అవగాహన కల్పించాలని చెప్పారు. జిల్లా పరిశ్రమల శాఖ జీఎం మారుతిప్రసాద్, ఏపీఐఐసీ జెడ్ఎం శివకుమార్, ఆర్డీఓలు అనూష, పావని, విద్యుత్, ఆర్ అండ్ బీ ఎస్‌ఈలు విజయన్, గంగాధర్, డీటీసీ చందర్, జిల్లా టీబీ నివారణాధికారి ఖాదర్‌వలీ, కమిటీ సభ్యులు ఏపీకే రెడ్డి, ఒమ్మిన సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరేమనుకుంటే.. నాకేంటి..!

- పంట పొలంలో సీసీ రోడ్డు నిర్మాణం
- ఉపాధి నిధులతో టీడీపీ నేత ఇష్టారాజ్యం
- తాటిపర్తిపాళెంలో నిర్వాకం


వెంకటాచలం: మండలంలోని తాటిపర్తిపాళెంలో టీడీపీ నేత నిర్వాకంతో రూ.పది లక్షల ప్రభుత్వ ధనం వృథా అయింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో 130 మీటర్ల పొడవుతో రూ.పది లక్షల అంచనాతో సీసీ రోడ్డును మంజూరు చేశారు. అయితే గ్రామానికి చెందిన ఓ టీడీపీ నేత సదరు రోడ్డును ప్రజలకు ఉపయోగడేలా కాకుండా తమ బంధువుల పొలాల్లోకి వెళ్లేలా నిర్మించారు. ఆ సమయంలో స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేసినా, పెడచెవిన పెట్టి తన ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. గ్రామంలో పలు నివాసాల మధ్యలో మట్టి రోడ్లు ఉన్నా, అక్కడ కాకుండా పొలాల మధ్య నిర్మించడంపై స్థానికులు మండిపడుతున్నారు. టీడీపీ నేత బంధువులకు సంబంధించిన నాలుగెకరాల పొలంలోకి వెళ్లేందుకు ప్రభుత్వ ధనంతో రోడ్డును నిర్మిస్తారనని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్మశాన వాటికకు వెళ్లేందుకు అంటూ అధికారులను తప్పుదోవ పట్టించారనే విమర్శలున్నాయి. ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. కాగా ఈ విషయమై పీఆర్ ఏఈ సాదిక్‌ను సంప్రదించగా, క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని బదులిచ్చారు.



పంట పొలాల మధ్యలో నిర్మించిన సీసీ రోడ్డు

బదిలీల జాతర

బదిలీలు, పాఠశాలల పునర్వ్యవస్థీకరణపై రకరకాల కొర్రీలు పెట్టిన కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల ఆందోళన పిలుపుతో ఎట్టకేలకు దిగొచ్చింది. బదిలీలకు గ్రీన్‌సిగ్నలిస్తూ ఉత్తర్వులను బుధవారం జారీ చేసింది. అయితే షెడ్యూల్‌ను హడావుడిగా ప్రకటించడంతో అంతా అయోమయం నెలకొంది. రోజుకో మార్పుతో జాబితా గందరగోళంగా మారింది.



- రోజుకో మార్పుతో గందరగోళంగా జాబితా
- లెక్కతేల్చలేక సతమతమవుతున్న అధికారులు
- ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం పోర్టల్ ప్రారంభం
- దివ్యాంగులకు సంబంధించి హైకోర్టు స్టేటస్ కో జారీ

నెల్లూరు(టౌన్): టీచర్ల బదిలీలు షురూ కానున్నాయి. ఈ క్రమంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో తప్పనిసరిగా బదిలీ అయ్యే ఉపాధ్యాయులు, పోస్టులపై ఎంఈఓలు, సిబ్బంది కసరత్తు వేగవంతం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫర్ పోర్టల్‌ను బుధవారం ప్రారంభించారు. ఎనిమిది, ఐదేళ్ల సర్వీస్‌ను పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు ఇందులో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రోజుకో మార్పు

బదిలీలు, పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధికారులు మార్పులు.. చేర్పులు చేస్తూ సిబ్బందిని గందరగోళంలోకి నెట్టారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఖాళీ పోస్టులు, బదిలీ అయ్యే ఉపాధ్యాయ జాబితాపై ఎటూ తేల్చలేక తలలు పట్టుకుంటున్న సందర్భాలూ ఉన్నాయి.

డీఎస్సీ పోస్టులు ప్రశ్నార్థకం

డీఎస్సీలో ప్రకటించిన 556 మంది స్కూల్ అసిస్టెంట్లకు పోస్టింగ్‌లను ఎక్కడి నుంచి తీసుకొస్తారనే అంశం ప్రశ్నార్థకంగా మారింది. ఎంపీపీ, జెడ్పీ పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్లకు పదోన్నతుల ఉండవని చెప్తున్నారు. కేవలం మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న కొద్ది మంది ఎస్జీటీలకే ఉంటాయంటున్నారు. ఎస్జీటీలకు సైతం పోస్టింగ్‌ల వ్యవహారం పలు అనుమానాలకు తావిస్తోంది.

దివ్యాంగ ఉపాధ్యాయ బదిలీలపై స్టేటస్ కో

ఆయా పాఠశాలల్లో పనిచేస్తూ ఎనిమిదేళ్ల సర్వీస్‌ను పూర్తి చేసుకున్న దివ్యాంగ ఉపాధ్యాయ బదిలీలపై రాష్ట్ర హైకోర్టు స్టేటస్‌కో ఉత్తర్వులను జారీ చేసింది. నూరు శాతం అంధత్వం, 70 శాతానికిపైగా ఆర్థో సమస్య ఉన్న ఉపాధ్యాయులకు వారి అంగీకారం మేరకు బదిలీ ఆర్డర్లను గత ప్రభుత్వ హయాంలో ఇచ్చేవారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అలాంటి ఉపాధ్యాయులకు 50 శాతం బదిలీలను తప్పనిసరి చేసింది. ఈ తరుణంలో నూరు శాతం అంధత్వం ఉన్న ఉపాధ్యాయులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో స్టేటస్ కో ఆర్డర్‌ను జారీ చేశారు. అయితే రాష్ట్ర విద్యాశాఖ అధికారులు అన్ని రకాల దివ్యాంగ ఉపాధ్యాయుల బదిలీలను నిలిపేశారని తెలిసింది. దీనిపై ఉపాధ్యాయ సంఘాల నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. స్టేటస్ కో ఆర్డర్ ఎవరికి వర్తిస్తుందో తెలియజేయాలని కోరుతున్నారు.

షెడ్యూల్ ఇలా..

ప్రక్రియ	హెచ్‌ఎం	స్కూల్ అసిస్టెంట్	ఎస్జీటీ
దరఖాస్తులు	ఈ నెల 21, 22	ఈ నెల 21 నుంచి 24	ఈ నెల 21 నుంచి 27
ప్రొవిజనల్ సీనియార్టీ జాబితా	24	26, 27	31
అభ్యంతరాల స్వీకరణ	25	28	28 నుంచి జూన్ 1 వరకు
తుది సీనియార్టీ జాబితా	27	31	జూన్ 6
వెబ్ ఆప్షన్లు	28	జూన్ 1, 2	జూన్ 7 నుంచి 10
బదిలీ ఉత్తర్వులు	30	జూన్ 4	జూన్ 11
పదోన్నతులు, వెబ్ ఆప్షన్లు	30	జూన్ 5	-
పదోన్నతుల ఉత్తర్వులు	31	జూన్ 6	-

ఐదేళ్లు నిండిన హెచ్‌ఎంలు.. ఖాళీ పోస్టులు

- ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఐదేళ్ల సర్వీస్‌ను పూర్తి చేసిన హెడ్‌మాస్టర్లు 45 మంది ఉన్నారంటూ జాబితాను విడుదల చేశారు. ఎంపీపీ, జెడ్పీ పాఠశాలల్లో 36 మంది.. మున్సిపల్ పాఠశాలల్లో ఒకరు.. నెల్లూరు కార్పొరేషన్ పాఠశాలల్లో 8 మంది ఉన్నారు.
- జిల్లాలో ఖాళీగా ఉన్న.. మృతిచెందిన.. రిటైరైన హెడ్‌మాస్టర్ల పోస్టులు ప్రభుత్వ – 4, ఎంపీపీ, జెడ్పీ 64.. కార్పొరేషన్ ఒకటి.. ఇలా 69గా ఉన్నాయని లెక్కలు చూపారు.
- రీ అపోర్షన్ పోస్టులు ప్రభుత్వ – 25.. నెల్లూరు కార్పొరేషన్ పాఠశాలల్లో రెండు ఉన్నాయని తేల్చారు. జిల్లా వ్యాప్తంగా 141 హెడ్‌మాస్టర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు.

ఎనిమిదేళ్లు పూర్తి చేసుకున్న ఎస్‌ఏలు, ఎస్జీటీలు

- ఎనిమిదేళ్ల సర్వీస్‌ను పూర్తి చేసుకున్న స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్ల వివరాలపై జిల్లా విద్యాశాఖ అధికారులు లెక్కలు తేల్చారు. స్కూల్ అసిస్టెంట్లు 1289 మంది.. సెకండరీ గ్రేడ్ టీచర్లు 1487 మంది ఉన్నారని పేర్కొన్నారు.
- జిల్లా వ్యాప్తంగా 774 స్కూల్ అసిస్టెంట్లు, 572 సెకండరీ గ్రేడ్ టీచర్ల పోస్టులు ఆయా పాఠశాలల్లో ఖాళీగా ఉన్నాయని జాబితాను విడుదల చేశారు. ఈ పోస్టులను బదిలీల్లో ఖాళీగా ఉన్నట్లు చూపించనున్నామని జిల్లా విద్యాశాఖ అధికారులు చెప్తున్నారు.
- జిల్లాలో 700 మందికిపైగా స్కూల్ అసిస్టెంట్లు మిగులు ఉన్నారని లెక్కలు తేల్చారు. వీరికి పోస్టింగ్ లేక రిజర్వ్‌లో పెట్టనున్నామని జిల్లా విద్యాశాఖ అధికారులు చెప్తున్నారు.

పారదర్శకంగా బదిలీలు

ఉపాధ్యాయ బదిలీలను పారదర్శకంగా జరపనున్నాం. జిల్లాలో అన్ని ఉపాధ్యాయ ఖాళీలను ప్రదర్శిస్తాం, హెడ్‌మాస్టర్లు, స్కూల్ అసిస్టెంట్ల బదిలీలను ఆన్‌లైన్లో నిర్వహిస్తాం. ఎస్జీటీలకు సంబంధించిన మార్గదర్శకాలు రావాల్సి ఉంది. ఇప్పటికే జిల్లాలో ఖాళీ పోస్టులు, ఐదేళ్లు పూర్తయిన హెడ్‌మాస్టర్లు, ఎనిమిదేళ్లను పూర్తి చేసుకున్న సెకండరీ గ్రేడ్ టీచర్ల వివరాలను సేకరించి జాబితాను రూపొందించాం. షెడ్యూల్ ప్రకారం బదిలీలను పూర్తి చేస్తాం.

– బాలాజీరావు, డీఈఓ

సిఫార్సు లేఖలకే పెద్దపీట

- ప్రజాప్రతినిధుల చుట్టూ ఉద్యోగుల ప్రదక్షిణలు
- యూనియన్ పేరిట బోగస్ లెటర్ల సృష్టి
- ఖాళీలు చూపించని పరిస్థితి
- బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖల్లో బదిలీల్లో ఇదీ పరిస్థితి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖల్లో బదిలీల ప్రక్రియ కుర్చీలాటను తలపిస్తోంది. తమకిష్టమైన ప్రాంతాలకు బదిలీ కావాలని కొందరు, ఉన్న చోటే తిష్ట వేయాలని మరికొందరు సాగిస్తున్న యత్నాలతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది.

ప్రదక్షిణలు

ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలుంటే ఉద్యోగులు తాము కోరుకున్న స్థానానికి బదిలీ అయ్యే అవకాశం ఉంది. దీంతో వీటి కోసం ఉద్యోగులు వారి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఒక ప్రజాప్రతినిధి ఒకే స్థానానికి ఇద్దరు, ముగ్గురికి సైతం లేఖలివ్వాల్సిన పరిస్థితి ఉంది. దీంతో తమకు అనుకూలమైన వారిని ఆయా ప్రదేశాలకు బదిలీ చేసేందుకు సిఫార్సు లేఖలిచ్చేందుకు ప్రజాప్రతినిధుల చుట్టూ ఉన్న కోటరీ పావులు కదుపుతోంది.

నకిలీ లేఖల కోసం పైరవీలు

ఉద్యోగ సంఘాల్లో క్రియాశీలకంగా ఉన్న నేతలకు బదిలీల్లో మినహాయింపు ఉంటుంది. దీంతో అందులో తామున్నామంటూ నకిలీ లేఖలు సృష్టించేందుకు పైరవీలు నడుపుతున్నారు. అసోసియేషన్‌తో సంబంధం లేకపోయినా, లెటర్ హెడ్‌లో వారి పేరు పెట్టేందుకు భారీగా డబ్బులు చేతులు మారుతున్నాయి. దీంతో ఉద్యోగ సంఘాల్లోని సీనియర్ నేతలు ఒక్కో పోస్టుకు రేటును ఫిక్స్ చేసి వసూళ్ల పర్వానికి తెరలేపారు. సభ్యత్వం లేకపోయినా, వారికి ఆ యూనియన్‌లో నకిలీ లేఖలను సృష్టిస్తున్నారు.

రెండులోపు ప్రక్రియ పూర్తి

సాధారణ బదిలీలకు ప్రభుత్వం ఇటీవల గ్రీన్ సిగ్నలిచ్చింది. జూన్ రెండులోపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించింది. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన కౌన్సెలింగ్ తరహాలో బదిలీలను జరపాలని పేర్కొంది. ఐదేళ్లుగా ఒకే చోట పనిచేస్తున్న వారిని ఇతర ప్రాంతాలకు కచ్చితంగా సాగనంపాలని ఉత్తర్వుల్లో నిర్దేశించారు. స్పౌస్, దివ్యాంగులు, వితంతువులు, దీర్ఘకాల వ్యాధులున్న వారు తదితరులకు మినహాయింపు ఉంటుంది. ఏడాదిలోపు ఉద్యోగ విరమణ పొందే వారికీ దీన్ని వర్తింపజేయాలని జీఓలో పేర్కొన్నారు. గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల్లో ప్రతినిధులుగా ఉన్నవారికి మూడుసార్లు అంటే తొమ్మిదేళ్ల పాటు ఒకే చోట ఉండేలా మినహాయింపులున్నాయి.


ఏళ్లుగా తిష్ట

కొందరు నేతలు ఒకే ప్రాంతంలో తొమ్మిదేళ్లకుపైగా పనిచేస్తున్నారు. జిల్లాలో గుర్తింపు పొందిన ఓ యూనియన్‌కు చెందిన ఉద్యోగి 15 ఏళ్లుగా సాంఘిక సంక్షేమ శాఖలో పనిచేయడం దీనికి ఉదాహరణ. ఇలా ప్రతి రెవెన్యూ డివిజన్లో యూనియన్ నేతలే ఏళ్ల తరబడి ఒకే చోట కొనసాగుతున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులకు బదిలీల ప్రక్రియ ప్రయోజనమివ్వడం లేదనే విమర్శలూ లేకపోలేదు. ఈసారైనా బదిలీలను పారదర్శకంగా జరపాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.

ఖాళీలను తెలియజేయకపోవడంతో అయోమయం

సాంఘిక సంక్షేమ, బీసీ వెల్ఫేర్‌తో పాటు దాదాపు అన్ని శాఖల్లో ఖాళీలను చూపించని పరిస్థితి నెలకొంది. వాస్తవానికి బదిలీలు కోరుకునే వారు ఆ శాఖ అధికారికి ఇచ్చే దరఖాస్తులో మూడు ఆప్షన్లను చూపాల్సి ఉంటుంది. అయితే ఎక్కడ.. ఎన్ని ఖాళీలున్నాయో ఉన్నతాధికారులు తెలియజేయకపోవడంతో అయోమయం నెలకొంది. ఖాళీ ప్రాంతాలను చూపి నోటీస్ బోర్డుల్లో పెట్టాల్సిన అధికారులు అలా చేయలేదు. ఖాళీలు తెలియకుండా ఆప్షన్లను ఎంపిక చేసుకోవడం ఎలా అనే ప్రశ్న వారిలో వ్యక్తమవుతోంది.

కరోనాపై అప్రమత్తం



నెల్లూరు(అర్బన్): దక్షిణాసియాతో పాటు దేశంలో కరోనా కేసులు స్వల్పంగా పెరిగాయి. ఒమిక్రాన్‌కు చెందిన ఉప వేరియంట్ జేఎన్ – 1 వైరస్ క్రమేపీ పెరుగుతుండటంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. మహారాష్ట్రతో పాటు కేరళలో కేసులు పెరగడంతో ప్రభుత్వ సూచనల మేరకు జిల్లా వైద్యశాఖ అధికారులు తగు చర్యలు చేపట్టారు. ఇతర దేశాలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారిలో ఏమైనా లక్షణాలున్నాయా లేదా పరిశీలించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ వైరస్‌తో ఇప్పటి వరకు పెద్దగా ప్రమాదం లేదని, రాష్ట్రంలో కేసులు నమోదు కాలేదని డీఎంహెచ్‌ఓ సుజాత తెలిపారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

క్లుప్తంగా

ప్రసన్న చేతికి ఆపరేషన్



ఆస్పత్రిలో ఉన్న ప్రసన్న

కోవూరు: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేతికి గురువారం నెల్లూరులోని ఎనెల్ ఆస్పత్రిలో చిన్న పాటి ఆపరేషన్ చేశారు. 15 రోజులపాటు విశ్రాంతిలో ఉండాలని డాక్టర్లు ఆయనకు సూచించారు. నాయకులు, కార్యకర్తలు కలిసేందుకు రావొద్దని ప్రసన్న కార్యాలయం విజ్ఞప్తి చేసింది.

కాలువలో మృతదేహం

ముత్తుకూరు(పొదలకూరు): మండలంలోని బ్రహ్మదేవి కాలువలో గుర్తుతెలియని మృతదేహాన్ని గురువారం స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దర్యాప్తు చేపట్టారు. మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రైల్వే ప్లాట్‌ఫారంపై వ్యక్తి మృతి



నెల్లూరు(క్రైమ్): అనారోగ్యమో?, ఇతర కారణమో తెలియదు గానీ నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ రెండో నంబర్ ప్లాట్‌ఫారంపై గుర్తుతెలియని వ్యక్తి గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి వయసు 55 నుంచి 60 ఏళ్లలోపు ఉండొచ్చని భావిస్తున్నారు. బులుగు రంగుపై పసుపు గళ్లు కలిగిన ఫుల్ హ్యాండ్స్ చొక్కా, బులుగు గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. నెల్లూరు రైల్వే ఎస్సై ఎస్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్సై కోరారు.

కండలేరులో 42.490 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 42.490 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 2,250, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 60, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

పత్రాలు పరిశీలించి.. వివరాలు సేకరించి..

- టిడ్కో గృహ సముదాయంలో కార్డన్ సెర్చ్
- అణువణువూ జల్లెడ
- 45 ద్విచక్ర వాహనాల స్వాధీనం



ప్రజలతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్లు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు భగత్‌సింగ్‌కాలనీలోని టిడ్కో గృహ సముదాయంలో పోలీసులు కార్డన్ సెర్చ్ చేపట్టారు. జిల్లాలో నేరాలను కట్టడి చేసి ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు అందించేందుకు ఎస్పీ జి.కృష్ణకాంత్ చర్యలు చేపట్టారు. అందులో భాగంగా నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలు, నగర శివారు ప్రాంతాలతోపాటు టిడ్కో గృహ సముదాయాల్లో కార్డన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నారు. గురువారం నలుగురు ఇన్‌స్పెక్టర్లు, 12 మంది ఎస్సైలతోపాటుగా సుమారు 100 మంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి భగత్‌సింగ్‌కాలనీలోని టిడ్కో గృహ సముదాయాల్లో తనిఖీలు చేశారు. ఇంటి యజమానితోపాటు కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను సేకరించారు. వారి ఆధార్ కార్డులను పరిశీలించారు. వాహనపత్రాలు సక్రమంగా లేని 45 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని నవాబుపేట పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఫిన్స్‌తో అనుమానాస్పద వ్యక్తుల వేలిముద్రలను సేకరించి పోలీసు రికార్డులతో పోల్చి చూశారు. ఏ ప్రాంతం వారు?, ఎప్పటి నుంచి ఇక్కడ నివాసం ఉంటున్నారు?, ఏం చేస్తున్నారు? తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నేర నియంత్రణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. యువత చెడువ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని, సన్మార్గంలో నడవాలని సూచించారు.



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలతో పోలీసు అధికారులు, సిబ్బంది

ప్రజలు సహకరించాలి

నేరనియంత్రణ, అసాంఘిక కార్యక్రమాల కట్టడే లక్ష్యంగా నిర్వహిస్తున్న కార్డన్ సెర్చ్‌లకు ప్రజలు సహకరించాలని ఎస్పీ కృష్ణకాంత్ విజ్ఞప్తి చేశారు. ప్రజలు తమవంతు బాధ్యతగా అనుమానాస్పద వ్యక్తులు, చట్టవ్యతిరేక కార్యకలాపాలు, మత్తు పదార్థాల వినియోగంపై డయల్ 112, 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం అందించే వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్డన్ సెర్చ్‌లో నవాబుపేట, సంతపేట, దర్గామిట్ట, వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్లు వేణుగోపాల్‌రెడ్డి, దశరథరామయ్య, రోశయ్య, శ్రీనివాసరావు, ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం

- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి
- సర్వేపల్లి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలతో సమావేశం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నాయకులు, కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో సర్వేపల్లి నియోజకవర్గ మండల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలతో గురువారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికార పార్టీ శ్రేణులు, అధికారులు తమను ఎలా ఇబ్బంది పెడుతున్నారో పలువురు నేతలు వివరించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడారు. పార్టీ నేతలు, ప్రజలకు తోడుగా ఉండాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారని తెలిపారు. అధికార పార్టీ నేతలు కక్ష సాధిస్తున్నారని, అందులో భాగంగా వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. ఆస్తుల ధ్వంసానికి పాల్పడుతున్నారని చెప్పారు. తమ పార్టీ నేతలను ఇబ్బంది పెట్టిన వాళ్లకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో అక్రమ కేసు బనాయించి బెయిల్ రాకుండా చేస్తున్నారని ఆరోపించారు. అయినా నేతలెవరు భయపడకుండా ఆత్మస్థైర్యంతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన వారిని వైఎస్ జగన్ గుర్తుంచుకుంటారని, తగిన ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వ విధానాలను ప్రజలు అసహ్యించుకుంటున్నారని, రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే వైఎస్సార్‌సీపీ 140 స్థానాలు కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. అధికార పార్టీ నేతలు ఇబ్బందులకు గురిచేస్తే కలెక్టర్, ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి వారి ఆగడాలకు అడ్డుకట్ట వేస్తామని తెలిపారు. నేతల సమస్యలను అవసరమైతే రాష్ట్ర నాయకత్వానికి తెలియజేసి న్యాయపరమైన మద్దతు కోరుతామన్నారు. తాను ముందుండి మీలో ఒకడిగా నడుస్తానని భరోసానిచ్చారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

భూసేకరణ ప్రక్రియ వేగవంతం

- కలెక్టర్ ఆనంద్




మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: జిల్లాలో వివిధ ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో గురువారం రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్ అండ్‌బీ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఏఐ, రైల్వే ఆర్‌ఓబీలు, ఆర్‌అండ్‌బీ రోడ్లు, ఏపీఐఐసీ, మెగా ఇండస్ట్రియల్ హబ్ మొదలైన వాటికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణను వెంటనే పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా అవార్డు చేసిన భూములకు సంబంధించి పొజిషన్ పూర్తయి చెల్లింపులు జరగని వారి విషయంలో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. రైల్వే ప్రాజెక్టులకు కొన్నిచోట్ల మ్యుటేషన్స్ పెండింగ్‌లో ఉన్నట్లుగా గుర్తించామన్నారు. అవార్డు అయ్యాక చెల్లింపులు చేసిన తర్వాత మ్యుటేషన్స్ కూడా పూర్తి చేస్తేనే ఆయా భూములను సంబంధిత ప్రాజెక్ట్ వారికి పూర్తిస్థాయిలో అందజేసినట్లు అవుతుందన్నారు. సమావేశంలో జిల్లా అటవీ శాఖాధికారి కె.మహబూబ్‌బాషా, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శివకుమార్, నెల్లూరు, ఆత్మకూరు, కావలి ఆర్డీఓలు అనూష, పావని, వంశీకృష్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హుస్సేన్ సాహెబ్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ గంగాధర్, సోమశిల ప్రాజెక్ట్ ఎస్‌ఈ వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

బిల్లుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

- ఎస్‌ఈ విజయన్



మాట్లాడుతున్న ఎస్‌ఈ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 'జిల్లాలో విద్యుత్ బిల్లుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలి' అని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ ఆదేశించారు. నెల్లూరులోని విద్యుత్ భవన్ నుంచి గురువారం ఆయన అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోలార్ విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. అదనపు విద్యుత్ వినియోగిస్తున్న వారు స్వచ్ఛందంగా క్రమబద్ధీకరణ చేసుకునేందుకు వెబ్‌సైట్‌లో లేదా విద్యుత్ ఉపకేంద్రాల్లో అధికారులను కలిసి దరఖాస్తు చేసుకునే సౌకర్యం కల్పించామన్నారు. కాన్ఫరెన్స్‌లో పీఎం సూర్యఘర్ జిల్లా నోడల్ అధికారి శేషాద్రి బాలచంద్ర, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.80
సన్నవి	: రూ.45
పండ్లు	: రూ.25



కోనలో హనుమజ్జయంతి



క్షేత్రోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: జిల్లాలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన పెంచలకోనలో గురువారం హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్షేత్ర పాలకుడైన ఆంజనేయస్వామి మూలమూర్తికి అభిషేకం, పూలంగి సేవ, ఆకుపూజ జరిపారు. సాయంత్రం తిరుచ్చిపై ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహం కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించి కోన మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

- వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో మృతదేహం

దగదర్తి: మండలంలోని లయన్స్ నగర్ జాతీయ రహదారి వంతెనపై గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై జంపానికుమార్ కథనం మేరకు.. గుర్తుతెలియని వ్యక్తి కాలినడకన వెళ్తుండగా వాహనం ఢీకొని మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి వయసు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

హంస వాహనంపై విహారం



ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవారు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి, అమ్మవారు హంస వాహనంపై విహరించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఈఓ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

లక్ష మంది శ్రామికులు హాజరయ్యేలా చర్యలు


నెల్లూరు(పొగతోట): ఉపాధి హామీ పనులకు లక్ష మంది శ్రామికులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ గంగా భవాని ఆదేశించారు. గురువారం నెల్లూరులోని డ్వామా కార్యాలయం నుంచి ఏపీఓలు, ఈసీలు, టీఏలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో పీడీ మాట్లాడారు. వర్షాల కారణంగా నాలుగు రోజుల నుంచి కూలీల సంఖ్య తగ్గిందన్నారు. వచ్చే వారం నుంచి లక్ష మంది శ్రామికులు పనులు నిర్వహించాలన్నారు. ఫాం పాండ్స్, ఇంకుడుగుంతలు తదితర లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. పల్లెవనం, చెరువుల అభివృద్ధికి సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

ఏపీ ఎల్డీఏ చైర్మన్‌గా గొల్లపల్లి కొనసాగింపు

కోవూరు: 'కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో పలు నామినేటెడ్ పదవులను రద్దు చేసింది. కానీ ఏపీ ఎల్డీఏ కమిటీని యథావిధిగానే కొనసాగించాలని హైకోర్టు ఆదేశాలిచ్చింది' అని చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ తెలిపారు. ఆయన గురువారం కోవూరులోని జిల్లా పశుసంవర్ధక శాఖకు చెందిన సెమన్ బ్యాంక్‌కు వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమిటీని రద్దు చేస్తూ గతంలో కలెక్టర్ ఆదేశాలిచ్చారన్నారు. దాన్ని సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించామన్నారు. ప్రస్తుతం ఉన్న కమిటీ నామినేటెడ్ కాదని, ఎన్నికల ద్వారా ఏర్పడిందన్న విషయాన్ని పరిగణలోకి తీసుకున్న కోర్టు ఆ మేరకు ఆదేశాలిచ్చిందని విజయకుమార్ తెలిపారు.

రైల్లోంచి పడి..

- గుర్తుతెలియని వ్యక్తి మృతి



కొడవలూరు: రైల్లో నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కొడవలూరు - పడుగుపాడు రైల్వే స్టేషన్ల మధ్య గురువారం జరిగింది. మృతుడి వయసు 35 - 40 సంవత్సరాల మధ్య ఉంటుంది. లైట్ బ్లూ కలర్ హాఫ్ హ్యాండ్స్ షర్ట్, బ్లూ, వైట్, బ్లాక్ చెక్స్ లుంగీ, వైట్ కలర్ కట్ బనియన్ ధరించి ఉన్నారు.రైల్లో నుంచి పడి చనిపోయి ఉంటాడని రైల్వే ఎస్సై రమాదేవి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడి ఆచూకీ తెలిస్తే కావలి రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు.

రేషన్ బియ్యం తరలింపుపై విచారణ



విచారణ చేపడుతున్న తహసీల్దార్ కోటేశ్వరరావు

కొండాపురం: మండలంలోని మర్రిగుంట మీదుగా రేషన్ బియ్యంను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని గ్రామస్తులు అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చిన విషయం తెల్సిందే. ఇందుకు సంబంధించి రెవెన్యూ అధికారులు ఎలాంటి విచారణ చేయలేదు. అయితే పోలీసులు డీలర్ సురేష్, వాహన డ్రైవర్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. ఈ నేపథ్యంలో కొండాపురం తహసీల్దార్ కోటేశ్వరరావు గురువారం గ్రామంలో విచారణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామానికి 5,150 రేషన్ కేజీల బియ్యం మంజూరు చేశామన్నారు. షాపులో తనిఖీలు చేయగా గ్రామస్తులందరూ వారి వేలిముద్రలు వేసి బియ్యం తీసుకున్నట్లు ఆన్‌లైన్‌లో నమోదైందన్నారు. షాపులో పరిశీలించగా గ్రామానికి కేటాయించిన బియ్యం లబ్ధిదారులకు అందజేశారని, మిగిలిన 25 కేజీల బియ్యం డీలర్ వద్ద స్టాక్ ఉన్నట్లు నిర్ధారించామన్నారు. ఇక్కడ అవకతవకలు జరగలేదని, అక్రమంగా తరలివెళ్లిన రేషన్ బియ్యం మర్రిగుంట షాపునకు సంబంధించినది కాదని తేల్చామన్నారు. ఆయనవెంట ఆర్‌ఐ బి.శ్రీనివాసులు, వీఆర్వో చెన్నకేశవులు ఉన్నారు.